
సంక్షేమ నిధులు.. ఆర్థిక పునాదులు

పేదరికం రూపుమాపుతామని దశాబ్దాలుగా ఏలిన పాలకులు హామీలిచ్చారే కానీ.. ఆచరణలో చూపించలేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సంక్షేమ పథకాలతో పేదల జీవన స్థితులు మార్చేందుకు ఆర్థిక పునాదులు వేశారు. సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే చేర్చుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. ఒక్క చిన్న సచివాలయం పరిధిలోనే రూ.కోట్ల సంక్షేమానికి ఖర్చు చేసిన ఘనత సీఎంకు దక్కుతుంది.

- అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.22,05,89,040
- ఇరిగేషన్ సచివాలయం పరిధిలో జనాభా 4,180
- మొత్తం ఓటర్లు 3,320
- డీబీటీ ద్వారా 4,360 మందికి లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా 1,796 మందికి ప్రయోజనం

ఆత్మకూరు: గత ప్రభుత్వాల కాలంలో ఏ సంక్షేమ పథకం పొందాలన్నా.. దరఖాస్తు చేసుకోవాలన్నా.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామ స్థాయి నేతల నుంచి ఎమ్మెల్యే వరకు సిఫార్సు లేఖలు తీసుకెళ్తేనే ఆ పథకం వారికి వచ్చేది. కొందరికి పథకాలు మంజూరైనా స్థానిక పార్టీల పెత్తందారులు వారికి అడ్డుపుల్లలు వేస్తూ జన్మభూమి కమిటీల సభ్యుల పేరుతో చక్రం తిప్పి లబ్ధిదారులకు మొండిచేయి చూపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితులకు చెక్ పెడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. గతంలో అడిగినా దక్కని సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చి అడిగి మరీ ఇస్తున్న పరిస్థితిని తీసుకువచ్చారు. ఏ పథకం అయినా లబ్ధిదారులకు అందకపోతే.. కారణాలు తెలుసుకుని పరిష్కరించి, మరో విడతలో అందజేస్తున్న గొప్ప ప్రభుత్వమిది. నవరత్నాల పథకాల్లో భాగంగా ఇంటి స్థలాలు, విద్యా కానుక, జగనన్న తోడు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ ఆసరా, తదితర ప్రయోజనాలను ఇంటి వద్దకే చేర్చుతున్నారు. 33 సంక్షేమ పథకాల ద్వారా వేలాది మంది లబ్ధిదారులు వాటిని డీబీటీ, నాన్‌డీబీటీ పద్ధతిలో సంక్షేమ ఫలాలను అందిస్తున్నారు.





షేక్ సయ్యద్ మస్తాన్ బేగం నిర్వహిస్తున్న టిఫిన్ దుకాణం

రూ.22 కోట్లకు పైగా సంక్షేమ నిధులు

ఆత్మకూరు ఇరిగేషన్ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.22,05,89,040 నగదు అందింది. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, చేయూత, జీరో వడ్డీ, తదితర సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్ల వ్యవధిలో అందిన నగదుతో లబ్ధిదారులు ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో భాగంగా చిరు వ్యాపారాలు ప్రారంభించి తమ కుటుంబాలను అప్పుల బాధ నుంచి తప్పించి హాయిగా జీవిస్తున్నారు. సచివాలయాల్లో ఆదాయం, కులం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ముటేషన్, పోలీస్ వెరిఫికేషన్, నోయర్నింగ్ సర్టిఫికెట్, సదరం దరఖాస్తులు, 1బి, అడంగళ్, ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు, టైటిల్ డీడ్, డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్, వాహనమిత్ర, తదితర 542 రకాల సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి.

సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	నగదు (రూ.)
అమ్మ ఒడి	352	1,44,62,100
జగనన్న విద్యాదీవెన	265	89,44,180
జగనన్న వసతి దీవెన	212	35,03,228
వైఎస్సార్ రైతు భరోసా	249	1,16,33,300
వైఎస్సార్ పంటల బీమా	10	2,13,805
వైఎస్సార్ జీరో వడ్డీ (రైతులు)	47	1,11,664
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	23	3,29,440
వైఎస్సార్ పెన్షన్ కానుక	440	4,15,78,000
వైఎస్సార్ చేయూత	160	68,81,250
వైఎస్సార్ ఆసరా	454	1,35,85,887
వైఎస్సార్ జీరో వడ్డీ (పొదుపు)	673	27,53,938
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	165	70,09,411
హౌసింగ్(నేరుగా చెల్లింపులు)	185	2,07,15,920
వైఎస్సార్ వాహనమిత్ర	18	5,20,000
ప్రత్యేక కోవిడ్ సాయం	797	7,97,000
జగనన్న ఇంటి ఇళ్లు	217	5,33,82,000

'చేయూత'తో ఆర్థిక ఇబ్బందులు తొలగాయి

గతంలో కుటుంబ పోషణకు కష్టంగా ఉండేది. మధ్య తరగతి కావడంతో అటు కూలి పనులకు పోలేక, చిన్న వ్యాపారం చేసుకుందామంటే పెట్టుబడిలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాను. పొదుపు గ్రూపులో ఉన్న నేను పొదుపు నగదు చెల్లించేందుకు ప్రతి నెలా ఇబ్బందులు పడ్డాను. నాలుగున్నరేళ్ల క్రితం 45 ఏళ్లు నిండిన వారికి ఏటా రూ.18,750, ఓసీలకు రూ.15 వేలు చొప్పున ఇస్తానని చెప్పిన మాట మేరకు నాకు ఏటా ఆ నగదు దక్కింది. దీంతో ఇంటి దగ్గరే టిఫిన్ సెంటర్ ప్రారంభించాను వ్యాపారం బాగా సాగుతోంది. చిన్న చిన్న అప్పులు తీరిపోగా కొంత సొమ్మును పొదుపు చేసుకున్నా. పొదుపు రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన మాట మేరకు సీఎం జగనన్న అమలు చేయడంతో మాకు జీవితంపై మంచి భరోసా ఏర్పడింది. జగనన్నకు రుణపడి ఉంటా.

– షేక్ సయ్యద్ మస్తాన్ బేగం, ఆత్మకూరు

'ఆసరా' ఆదుకుంది



గత ప్రభుత్వ కాలంలో పొదుపు రుణాలు మాఫీ చేస్తానని, కుదువ పెట్టిన నగలు తెచ్చుకునేందుకు సహకరిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అమలు చేయలేక చేతులెత్తేసింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అయితే వైఎస్ జగనన్న ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల తేదీ నాటికి బ్యాంకుల్లో బాకీ ఉన్న పొదుపు రుణాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని ఆ మేరకు నా ఖాతాలో జమ అయింది. ఏడాది రూ.17500 చొప్పున మొత్తం రూ.70 వేలు నాకు జమ అయింది. అప్పటికే నిర్వహిస్తున్న చిన్న వ్యాపారం అభివృద్ధి చెందేందుకు ఆసరా పథకం ఆదుకుంది. ఇంటి నిర్వహిస్తున్న వద్దనే కూల్ డ్రింక్, జ్యూస్ సెంటర్ బాగా జరుగుతుంది. మాకు ఆర్థిక ఇబ్బందులు తీరాయి.

– డి లక్ష్మి, ఆత్మకూరు

క్లుప్తంగా

విద్యార్థులు చట్టాలను తెలుసుకోవాలి

- బి రాజేష్, సీనియర్ సివిల్ జడ్జి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో ఆయన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి రాజేష్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, అన్ని వర్గాల ప్రజలకు విద్య తప్పనిసరి చేస్తూ చట్టం చేశారన్నారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికీ చిన్నారులు విద్యకు దూరంగా ఉండడం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకుని పలువురికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

దండా కృష్ణారెడ్డికి ఘన సన్మానం



దండా కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అల్లూరు: రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కమిటీ కార్యదర్శిగా నియమితులైన వైఎస్సార్ సీపీ అల్లూరు పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డిని శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చి, కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర స్థాయిలో తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాన్నరు. 2024లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, మధురెడ్డి, తాండ్ర మల్లి, దైవాదీనం, భక్తవత్సలరెడ్డి, కరుణాకర్, ఉస్మాన్, మునిరాజ్, సుధ, రసూల్, జంషీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ పర్యటనను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ సోమవారం కావలిలో నిర్వహించే పర్యటనను జయప్రదం చేయాలని ఆత్మకూరు ఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో ఆత్మకూరు ఇన్‌చార్జి బి మహేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్లగా చేస్తున్న వర్గీకరణ ఉద్యమం చివరి దశకు చేరుకుందని కేంద్రంలోని బీజేపీ సైతం సానుకూలంగా స్పందించడంతో భవిష్యత్ కార్యాచరణను చర్చించేందుకు ఈ సమావేశం వేదిక కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా, ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు తాటిపర్తి లక్ష్మయ్య, గడ్డం ఆదినారాయణ, రమణమ్మ, దేవరపాటి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో బ్యాంకు రుణాలు



శిక్షణ నిర్వహిస్తున్న విశ్వప్రగతి బృందం

సోమశిల: స్వయం ఉపాధి ద్వారా శిక్షణ పొందిన యువతి యువకులు బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చునని విశ్వప్రగతి ఆర్గనైజర్ ఆనంద్ పాల్ తెలిపారు. అనంతసాగరం మండలంలోని కామిరెడ్డిపాడులో ఫినాయిల్, సోపు పొడర్, నిత్యావసర వస్తువులపై శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి యూనిట్లపై రాయితీలు కల్పించినట్లు ఆర్గనైజర్ ఆనంద్‌పాల్ తెలిపారు. కింగ్ జీసెస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆర్గనైజ్ జాన్‌భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని సోమశిల, కామిరెడ్డిపాడు, చిలకలమర్రి, శంకనగరం గ్రామాల్లో విశ్వప్రగతి ఆధ్వర్యంలో ప్రజలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన అన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల మొక్కుల జాతర



అల్లూరు నుంచి భారీ బైక్ ర్యాలీగా బయలు దేరిన కొండబ్రిగుంటకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- అల్లూరు నుంచి భారీగా కొండ బిట్రగుంట వరకు బైక్ ర్యాలీ
- కావలి నుంచి పాదయాత్రగా తరలివచ్చిన క్యాడర్

కావలి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డిపై పార్టీ విధించిన సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు కందుకూరు ఎన్నికల పరిశీలకుడిగా నియమించిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా శనివారం కొండ బిట్రగుంటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అల్లూరు నుంచి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి కొండ బ్రిగుంటకు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలను బైక్‌లకు కట్టుకొని దారి పొడవునా జై జగనన్న, జై ప్రతాపన్న, జై సుకుమారన్నా అంటూ నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ ముందు డీజే సౌండ్‌తో మినీ ట్రక్ ఆటోలో జగన్ పాటలతో దారిపొడవునా సందడి చేశారు. అల్లూరు నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీ అల్లూరు, బోగోలు మండలాలు మీదగా జాతీయ రహదారిపై నుంచి కొండ బిట్రగుంటకు చేరుకొంది. కావలి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా బయలుదేరి కొండ బ్రిగుంటకు చేరుకొంది. కావలితో పాటు కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా కొండ బిట్రగుంటకు చేరుకోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలు వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలతో కళకళలాడింది. అనంతరం సుకుమార్‌రెడ్డి ఆలయానికి చేరుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించడానికి సుకుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తామని మొక్కులు తీర్చుకున్నారు.

జనహితం కోసం తపించిన జన్నత్‌హుస్సేన్

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: సీనియర్ ఐఏఎస్ అధికారిగా తాను పని చేసిన ప్రతి చోట దివంగత జన్నత్ హుస్సేన్ జనహితం కోసం తపించారని నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఆయన పని చేసిన సమయంలో పేదలపై ఆయన చూపిన ప్రేమాభిమానాలు జిల్లా ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్నారు. జిల్లాలోని అనేక దళితవాడలు, పేదల కాలనీలు, ఆయన పేరుతో వెలిశాయంటే ఆయనపై ప్రజలకు ఉన్న ప్రేమ తెలియజేస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక చీఫ్ సెక్రటరీగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. చివరి దశలో అల్జీమర్ వ్యాధితో ఆయన బాధపడుతున్నప్పుడు తాను స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పానని, ఆయన కుమారుడు ఇంతియాజ్ ఆయన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. తనకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ జన్నత్ హుస్సేన్ ఆరోగ్య విషయాలు తెలియజేసేవారన్నారు. జన్నత్ హుస్సేన్ కుటుంబంతో తమకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తమకు అండగా ఉన్నారన్నారు. జన్నత్ హుస్సేన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



సంగం: కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా రమాదేవి సమేత సత్యనారాయణస్వామి సామూహిక వ్రత పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, స్వామి అమ్మ వారిని పరిమళ పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాఘ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం రామాలయంలో శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. సీతాసమేత శ్రీరామచంద్రుడి ఉత్సవ మూర్తులకు, ఆలయంలోని మూలవిరాట్‌లకు విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష పుష్పాలంకరణ గావించి ధూప, దీప, నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కావలి: వాటర్ బాటిల్ కోసం అవతలి పక్కన ఉన్న దుకాణానికి రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని కారు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని రుద్రకోట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు.. గుడ్లూరు ఎస్టీ కాలనీకి చెందిన పాలకీర్తి వెంకటేశ్వర్లు (35) తిరుపతి నుంచి కావలికి వచ్చిన తన సమీప బంధువును సింగరాయకొండకు తీసుకువెళ్లేందుకు పల్సర్ బైక్‌పై కావలికి వచ్చాడు. బంధువుతో కలిసి బైక్‌పై వెళుతుండగా రుద్రకోట సమీపంలో వాటర్ బాటిల్ కోసం బైక్‌ను నిలిపి రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

ఉదయగిరి: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న పక్కా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ సూచించారు. ఆమె శనివారం కార్యదర్శులతో సమీక్షించారు. మండలంలో 989 జగనన్న ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 843 పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా చేసి నూరు శాతం లక్ష్యం సాధించాలన్నారు. ఇంటి పన్నులు వసూళ్ల ముమ్మరం చేయాలన్నారు. మార్చి చివరి నాటికి పూర్తిగా ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. వలంటీర్లు ఆరోగ్య శ్రీకార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు లబ్ధిదారులకు అందించి ఈకేవైసీ చేయాలన్నారు.

సాధన సంకల్ప సభ నేడు

ఆత్మకూరు: అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 'దళితవాడ ప్రత్యేక పంచాయతీ' సాధన సంకల్ప సభ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఏఐఎం సభ్యులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ సభను జయప్రదం చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించడం ద్వారా దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా నిర్వహించుకోవచ్చునని లక్ష్యంతో సాగే ఈ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో నూతనంగా నిర్మించనున్న గురప్పస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం నిర్వాహకులు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. బుడంగుంట్ల వంశస్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని గణపతి పూజ, పుణ్యాహ వాచనం, కలశ పూజ, నవగ్రహ పూజ, వాస్తు హోమం, వాస్తుపూజ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్న సంతర్పణ చేశారు.

వైఎస్సార్‌సీపీలో 150 టీడీపీ కుటుంబాల చేరిక



కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ వర్గీయులు

కావలి: పట్టణంలోని వడ్డెపాళెంకు చెందిన 150 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెలే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేర్చాలి

మర్రిపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేర్చాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని ఎంపీడీఓ మనోహర్‌రాజు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నామన్నారు. మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల వివరాలపై చర్చించారు. ప్రభుత్వ పరంగా జరుగుతున్న వివిధ సర్వేలు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను ఇప్పటికే మండలంలో పంపిణీ చేశామని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటికి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండి ప్రజలకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

చేజర్ల: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా చేజర్ల, మడపల్లి గ్రామాలకు పెన్నానది నుంచి తాగు నీరు సరఫరా చేసే పైప్‌లైన్ పనులను మడపల్లి సర్పంచ్ మద్దాల వెంకటమ్మ శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పెన్నా నది నుంచి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు ఇప్పటికే బోర్ల నిర్మాణం పూర్తయిందన్నారు. పైప్‌లైన్ ఏర్పాటైతే చేజర్ల, మడపల్లి గ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువత మండల అధ్యక్షుడు ఆంద్రా వెంకటరెడ్డి, నాయకులు పి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణ, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి, అంకిరెడ్డి, చంద్ర, రమేష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

- సీపీఎం నిరసన ప్రదర్శన

ఆత్మకూరు: పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ సీపీఎం, కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ డిపో వద్ద నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నెల్లూరుపాళెం నుంచి సోమశిల రోడ్డు మలుపు వరకు రోడ్డు నిర్మించాల్సి ఉండగా, ఆర్టీసీ డిపో వరకే నిర్మించి వదిలేశారన్నారు. అక్కడి నుంచి ఇరువైపులా అక్రమ కట్టడాలను తొలగించి రోడ్డు విస్తరణ చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరైన నగదు సైతం మురిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందానీ, కౌలు రైతు సంఘం నాయకుడు లక్ష్మీపతి, వాగాల శ్రీహరి, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, గద్దర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై చైతన్య ర్యాలీ



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని, ఓటును తప్పని సరిగా వినియోగించాలని పలువురు వక్తలు అన్నారు. మున్సిపల్ కమిషనర్ కె షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో శనివారం ఓటు హక్కు చైతన్య ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారులు సతీష్, చంద్రప్రకాష్ మాట్లాడుతూ ఓట్లను అమ్ముకోరాదని, న్యాయబద్ధంగా ఓటు పోల్ చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.